

మహిళా రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. అనేక రంగాల్లో నేడు మహిళలు పని చేస్తున్నారు. వారి భద్రతపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన చాలా దారుణం. ఈ కేసులో ప్రభుత్వాలు స్పందించిన తీరు సక్రమంగా లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– ఉప్పాడ త్రిమూర్తి, సీఐటీయూ కార్యదర్శి, పెనమలూరు



ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి

పని ప్రదేశాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి. కనీసం విశ్రాంతి తీసుకునే ఆస్కారం కూడా లేకుండా మహిళా ఉద్యోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళా ఉద్యోగులు పని చేసే ప్రదేశాల్లో భద్రత పెంచాలి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యుల సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక బాధ్యతలు వహించాలి. వారికి అనునిత్యం అండగా ఉండాలి. అప్పుడే మహిళా ఉద్యోగులకు రక్షణ లభిస్తుంది.

– డాక్టర్ పి. నీలిమ, వైద్యాధికారి, ఆయుర్వేద ఆసుపత్రి, కోలవెన్ను, కంకిపాడు మండలం



క్లుప్తంగా

మూలనపడ్డ చెత్త రిక్షాలు



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ ఆధ్వర్యంలో చెత్త తరలించేందుకు కొనుగోలు చేసిన కొత్త రిక్షాలు నిర్లక్ష్యానికి గురై మూలన పడ్డాయి. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్పంచ్ వరి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో తీర్మానించి కొత్త రిక్షాలను కొనుగోలు చేశారు. అయితే ప్రస్తుతం వీటిని సద్వినియోగపరచకుండా గ్రామంలోని పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ సమీపంలో రోడ్డు వెంట మూలన పడేశారు. మూలన పడేసిన ఈ రిక్షాలను చెత్త తరలించడానికి వినియోగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తిరుమలకు కూరగాయల వితరణ



గన్నవరం: తిరుమల తిరుపతి దేవస్థానానికి గన్నవరానికి చెందిన శ్రీవారి భక్త సమాజం పది టన్నుల కూరగాయలను విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి కూరగాయల లోడుతో లారీ తిరుమలకు బయలుదేరింది. పూజ కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జెండా ఊపి లారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు కూరగాయలు వితరణగా ఇవ్వడం అభినందనీయమన్నారు. తిరుమలేశుని చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పలువురు పుర ప్రముఖులు, శ్రీవారి భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం



గన్నవరం రూరల్: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యమని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం గన్నవరం ఏబీ కన్వెన్షన్‌లో సూరంపల్లి పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు కాసరనేని సత్యన్నారాయణ కుమారుడు ధన శ్రీరామ్, మేఘన నూతన దంపతుల వివాహానికి విచ్చేసి కల్యాణమస్తు పథకం ద్వారా నాలుగు గ్రాముల గోల్డ్ కాయిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతుల కుటుంబాలకు విజయ డెయిరీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా డైరెక్టర్ పాలడుగు నాని, గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఎంపీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ ఫండ్స్ రూ. 7 లక్షలతో ఈ ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అదనంగా వాకర్స్ అసోసియేషన్ ఆర్థిక సౌజన్యంతో జిమ్ ప్రాంగణంలో కాంక్రీట్ లెవలింగ్, చుట్టూ ఐరన్ మెష్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓపెన్ జిమ్‌ను మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వాకర్స్ సభ్యులు, క్రీడాభిమానులు హాజరుకావాలని కోరారు.

30న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 30న శ్రావణ మాసం 4వ శుక్రవారం పురస్కరించుకుని ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఈ వ్రతాలకు హాజరయ్యే భక్తులు తమ వెంట పూజా సామగ్రిని తెచ్చుకోవాలని సూచించారు. దేవస్థానం వారు పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదం అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారి

- జీటలువారిన కేసరపల్లి–సావరగూడెం రోడ్డు
- పట్టించుకోని అధికారులు

గన్నవరం రూరల్: మండలంలోని కేసరపల్లి–సావరగూడెం రహదారి అధ్వాన దుస్థితిలో ఉంది. మార్గం మధ్యలో ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసం కావడంతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడ చేరుకోవాలంటే జాతీయ రహదారి–16 రోడ్డు మార్గంగా ఉంది. అయితే ఈ రోడ్డుకు ప్రత్యామ్నాయ రహదారిగా ఉన్న రామవరప్పాడు నుంచి ఫ్లైఓవర్ మీదుగా ముస్తాబాద, సావరగూడెం, కేసరపల్లి దాటి వాహనాలు జాతీయ రహదారిపైకి చేరుకుని ఏలూరు వైపు, విమానాశ్రయానికి వెళ్లే వీలు ఉంది. జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఉన్న ఈ రోడ్డుపై అధికారులు కనీసం శ్రద్ధ చూపించడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు గోడౌన్‌ల సమీపంలో రహదారి పూర్తిగా ధ్వంసం అయ్యింది. రాత్రి వేళల ఈ రోడ్డు మార్గంలో నడిచే వాహనాలు ఆ గోతుల్లో పడి గాయాలపాలు అవుతున్నారు. వంద మీటర్ల వరకూ రహదారి కుప్పకూలింది. అంతేగాక ఈ మార్గంలో నడిచే వాగుల వద్ద, పంట కాలువల వద్ద రోడ్డు ధ్వంసం అయ్యింది. కేసరపల్లి, సావరగూడెం, ముస్తాబాద, సూరంపల్లి, పురుషోత్తపట్నం, మాదలవారిగూడెం గ్రామాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు నిత్యం ఈ రహదారిపై ప్రయాణాలు చేస్తుంటారు. ఇటీవల కాలంలో ఈ రహదారి వెంట అనేక కంపెనీలు, వెంచర్‌లు, విల్లాలు ఏర్పడ్డాయి. ముఖ్యమైన కేసరపల్లి–సావరగూడెం రహదారిపై రోడ్డు దెబ్బతిన్న ప్రదేశం వద్ద బాగుజేసి, రహదారి గోతులు పూడ్చాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.



ధ్వంసమైన సావరగూడెం ఆర్‌అండ్‌బీ రహదారి



రోడ్డు వెంట విరిగి పడిపోయిన మట్టి

పోరంకిలో కృష్ణాష్టమి పూజలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేసి విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా సోమవారం జరగనున్న కృష్ణాష్టమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయానికి వచ్చి కృష్ణాష్టమి వేడుకలు తిలకించాలని ఈఓ సుబ్బారెడ్డి కోరారు.

పెనమలూరులో..

పెనమలూరులో వంతెన వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణుడి ఆలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో మంగళవారం భక్తులను అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.



ప్రత్యేక అలంకరణలో శ్రీవేణుగోపాలస్వామి

ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు

పెనమలూరు: కృష్ణానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు. చోడవరం ఇసుక క్వారీని ఆదివారం ఆయన పరిశీలించారు. సీఐ వివరాలు తెలుపుతూ ప్రభుత్వ అనుమతులు ఇచ్చిన తర్వాతే నిబంధనల ప్రకారం అధికారుల పర్యవేక్షణలో ఇసుక తరలింపు చేయాలని అన్నారు. అయితే చోడవరం ఇసుక క్వారీలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా క్వారీలోకి వెళ్లే మార్గానికి గుంత తవ్వి గండి కొట్టామన్నారు. చోడవరం, యనమలకుదురు క్వారీల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీస్ పికెట్లు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఇసుక అక్రమ తరలింపుపై స్థానికులు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



చోడవరం క్వారీ వద్ద గండి కొట్టిన ర్యాంప్‌ను పరిశీలిస్తున్న సీఐ వెంకటరమణ

ఉపాధ్యాయ నేత చిన్నప్పకు నివాళి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉపాధ్యాయ సంఘ నేతగా వేమూరి చిన్నప్ప చేసిన పోరాటం చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ వేమూరి చిన్నప్ప సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘ నేతలు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నేతగా వేమూరి చిన్నప్ప అంకితభావం నేటి తరం టీచర్లకు ఎంతో ఆదర్శనీయమని చెప్పారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, యూటీఎఫ్ నాయకులు, సీపీఎం నాయకుడు అబ్దుల్ బారీ తదితరులు పాల్గొన్నారు.



చిన్నప్పకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు, ప్రజా ప్రతినిధులు

పోరంకిలో చోరీ

పెనమలూరు: పోరంకి గ్రామంలో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాసానగర్ సాయిబాబా గుడి సమీపంలో ఎ.అబ్బులు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంటికి 22వ తేదీన తాళం వేశాడు. భార్య పుట్టింటి నుంచి శనివారం తిరిగి వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగుల కొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, రూ. 20 వేల సొమ్ము చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడు అబ్బులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కేబుల్ వైరు చోరీపై కేసు నమోదు

కంకిపాడు: కేబుల్ వైరు చోరీ ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని గొడవర్రు గ్రామానికి వెళ్లే రహదారి మార్గంలో వంతెన వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్‌కి చెందిన 10 మీటర్ల కేబుల్ వైరు కత్తిరించి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై జేటీఓ రజనీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగుడికి నిత్యావసర సరుకుల వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎవరూ లేని దివ్యాంగుడికి దీవెన ఫౌండేషన్ నిత్యావసర సరుకులను వితరణ చేసింది. విజయవాడ రూరల్ నున్న గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాంబాబు తినడానికి తిండి లేక గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అతను సహాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించగా వారు వెంటనే స్పందించారు. విజయవాడ సిటీ పోలీస్ తరఫున నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలను నున్న పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యరాజు, గ్రూప్ సభ్యులు రవి ఆదివారం రాంబాబు ఇంటికి వెళ్లి అందజేశారు. ఆపదలో తనలాంటి పేదవారికి సహాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ గ్రూప్ సభ్యులకు రాంబాబు కృతజ్ఞతలు తెలియజేశాడు.



రాంబాబుకు సరుకులు అందజేస్తున్న ఏఎస్ఐ సత్యరాజు, రవి

పైపులైనుతో ప్రజలకు అవస్థలు

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ శివారు గ్రామాల్లో సీతారామపురం, వెంకటాపురం, అప్పారావుపేట గ్రామాల్లో జలజీవన్ మిషన్ గ్రాంటుతో నిర్మించిన పైపులైనుతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్ పేరుతో పై మూడు గ్రామాల్లో దాదాపు 150 గృహాలకు ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడం కోసం వాటర్ పైపులైను నిర్మించడం జరిగింది. ఐరన్ పైపులైన్ మూడు అంగుళాల సైజుతో నిర్మించి దాని నుంచి ఇంటికి కనెక్షన్ ఇవ్వడంతో తమ ద్విచక్రవాహనాలను ఇంట్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి కనెక్షన్ ఇంట్లోకి వచ్చిందని సంతోష పడుతున్న వేళ ఇది అసౌకర్యంగా ఉందంటున్నారు. ద్విచక్రవాహనాలను బయటే పార్కు చేద్దామంటే దొంగల భయం అధికంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. సీతారామపురం గ్రామంలో రూ. 20లక్షలు, వెంకటాపురం గ్రామంలో రూ. 13లక్షలు, అప్పారావుపేటలో రూ. 20లక్షలు మొత్తం కలిపి రూ. 53 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికి తాగునీటి కనెక్షన్ ఇవ్వడం కోసం పైపులైను నిర్మించడం జరిగింది. పైపులైను నిర్మాణం ఉన్న ఇళ్ల వద్ద, రోడ్డు ప్రారంభంలో ఉన్న ప్రాంతాల్లో సిమెంటు వేసి ద్విచక్రవాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆ మూడు గ్రామాల ప్రజలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.





అప్పారావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులైను

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం



విశేష అలంకరణలో స్వామివారు

ఇస్కాన్ మందిర ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా జగన్నాథస్వామివారికి పుష్పాభిషేకం, 108 రకాల పిండివంటలతో భోగ సమర్పించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. అంతకు ముందు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నృత్యం చేస్తున్న కళాకారిణి



పుష్పాభిషేకానికి పూలు సిద్ధం చేస్తున్న భక్తులు



ఉట్టి కొడుతున్న యువత

రేపటి నుంచి గంధ మహోత్సవం



భవానీపురం(విజయవాడ పశ్చిమ): విజయవాడ స్వాతి సెంటర్‌లోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్టీ ఔలియా దర్గా 40వ ఉరుసు(గంధం) మహోత్సవం ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఖాజీ, దర్గా ముతవల్లి/అధ్యక్షుడు సయ్యద్ షా మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్టీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు మంగళవారం ఉరుసు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు భవానీపురంలోని బాబా దర్గా నుంచి గంధం తీసుకుని వాహనంలో ఊరేగింపుగా బయలుదేరి ప్రకాశం బ్యారేజీ, కాళేశ్వరరావు మార్కెట్ మీదుగా వించిపేటలో బాబా దేవుని ధ్యానం చేసిన ప్రదేశానికి(రైల్వే స్టేషన్ వెస్ట్ వైపు గల షాజహూర్ ముసాఫిర్ ఖానాలోని షాప్ నంబర్ 9) వద్దకు చేరుకుంటుందని చెప్పారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి సొరంగం మీదుగా రాత్రి 9 గంటలకు బాబా దర్గాకు చేరుకుంటుందన్నారు. అనంతరం గంధంను దర్గాకు తీసుకువస్తామన్నారు. గురువారం దీపారాధన, సాయంత్రం ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు ఖవ్వాలీ ప్రోగ్రామ్ ఉంటుందని తెలిపారు.

మన సంస్కృతీ సంప్రదాయాలు నేటి యువతకు తెలపాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆధునికత మోజులో పడి నేటి తరం యువత మన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోతుందని బ్లూమింగ్‌డేల్ స్కూల్ చైర్మన్ అట్లూరి విజయబాబు అన్నారు. భారతీయ సంస్కృతీ, కళలు, వృత్తులు, వాటి విశిష్టతను భావి భారత పౌరులైన విద్యార్థులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. నగరంలోని బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం సంస్కృతి–2024 పేరిట వినూత్న కార్యక్రమం నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను, తల్లిదండ్రులను అలరించింది. పల్లెటూరి వాతావరణం, వస్త్రధారణ, చిరుధాన్యాలతో వంటలు ఇలా మన పూర్వీకుల జీవన విధానాన్ని తెలిపేలా చేసిన ఏర్పాట్లు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. సాంప్రదాయ దుస్తులతో ఉన్న విద్యార్థులను చూసి తల్లిదండ్రులు సంబరపడ్డారు. పూర్వం గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఆడుకున్న ఆటలను విద్యార్థులకు పరిచయం చేయడమే కాకుండా వారితో ఆడించారు. మన పూర్వీకులు తినే ఆహారం, పిండివంటలు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ.. మన పూర్వీకుల అలవాట్లు, జీవన విధానాలు తెలపడం ద్వారా భవిష్యత్తు తరాలకు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హర్‌సిమ్రన్, నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు జి.సురేంద్ర, విజయవాడ క్లబ్ కార్యదర్శి సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



పల్లెటూరి వస్త్రధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మాదిగ దండోరాకు అభినందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణకు 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి సుప్రీంకోర్టులో విజయం సాధించిన మాదిగ దండోరాకు మాదిగ ఆత్మీయ కలయిక అధ్యక్షుడు కటికల అజిత్‌బాబు అభినందనలు తెలిపారు. తీర్పు చెప్పిన ఏడుగురు జడ్జిలకు ఆత్మీయ కలయిక తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మాదిగల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు మేరకు తక్షణమే వర్గీకరణ చేయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పొలిట్‌బ్యూరో సమావేశంలో జిల్లాల వారీగా వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారనీ, అలా కాకుండా గతంలో చేసిన విధంగానే చేయాలని కోరారు. ఆ విధంగా చేస్తేనే 59 మాదిగ, మాదిగ ఉపకులాలు లబ్ధి పొందుతాయన్నారు. సమావేశంలో పి.సుంకన్ పండు, నూనె రమేష్, ఎమ్మార్పీఎస్ సభ్యులు పచ్చల రాజేష్, నంబూరి సురేష బాబు, బిలుగుది బాబురావు, కాకాని జగదీశ్వరరావు, కండెల వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

